సాక్షి ప్రకాశం

శుక్రవారం । 27 । డిసెంబర్ । 2024



ఆరుగాలం కష్టం.. వర్షార్పణం!
బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా జిల్లాలో కురుస్తున్న వర్షాలకు భారీగా పంట నష్టం జరిగింది. అన్నదాత కష్టమంతా నీటిపాలైంది.
- 10లో..



నవ వధువు ఆత్మహత్య
అత్తమామలు, భర్త వేధింపులు తట్టుకోలేక నవ వధువు ఆత్మహత్య చేసుకుంది. పెళ్లయిన నెల రోజులకే మృతిచెందడంతో ఆమె తల్లిదండ్రులు భోరున విలపించారు.
- 10లో..

గరిష్టం/కనిష్టం 30/21

వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. వర్షం కురిసే అవకాశం ఉంది. చలిగాలులు వీస్తాయి.

ఒక్క నెలలో రూ.లక్ష అదనం...

మన్నేరు సమీపంలో సుమారు 40కిపైగా రొయ్యల చెరువులు సాగు చేసే సింగరాయకొండకు చెందిన వలేటి నరసింహానికి గత నెలలో రూ.4.10 లక్షల కరెంటు బిల్లు వచ్చింది. కానీ, ఈ నెల రూ.5.30 లక్షలు రావడంతో ఎలా చెల్లించాలని మదపడుతున్నాడు. గత నెలతో పోలిస్తే రూ.1.20 లక్షలు అదనంగా వచ్చిందని, ఈ విధంగా కరెంటు బిల్లులు పెంచితే ఆర్థికంగా నష్టపోతామని ఆవేదన వ్యక్తం చేశాడు. నిన్నటి వరకు 10 ఎకరాల్లోపు ఉన్న చెరువులకు యూనిట్ ధర రూ.1.50 ఉండగా, 10 ఎకరాలపైన ఉన్న చెరువులకు యూనిట్ ధర రూ.4.50 ఉంది. పెరిగిన విద్యుత్ చార్జీల ప్రకారం చిన్న చెరువులకు యూనిట్ ధర రూ.2.42, పెద్ద చెరువులకు యూనిట్ ధర రూ.5.42గా ఉంది.

ఏం తిని బతకాలో..

ఒంగోలు ఇస్లాంపేటకు చెందిన షేక్ అబ్దుల్లా మెకానిక్. సొంత ఇల్లు కూడా లేదు. అద్దె ఇంట్లో బతుకు బండి లాగుతున్నాడు. ఇతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పిల్లలు చదువుకుంటున్నారు. ఇంట్లో ఫ్యాన్, మిక్సీ తప్పించి పెద్దగా విద్యుత్ పరికరాలు లేవు. నిన్నమొన్నటి వరకు నెలకు రూ.350 వరకు విద్యుత్ బిల్లు వచ్చేది. ఈ నెల ఏకంగా రూ.1000 వచ్చింది. బిల్లు చూసి షాక్‌కు గురైన అతడు గుంటూరు రోడ్డులో ఉన్న విద్యుత్ కార్యాలయానికి వెళ్లాడు. ఇంత బిల్లు ఎందుకొచ్చిందని ఆరా తీస్తే సర్దుబాటు బిల్లు అంటూ వారు జవాబిచ్చారు. నెలకు అంత బిల్లు కడితే ఇక ఏం తిని బతకాలో అర్థం కావడం లేదని వాపోతున్నాడు.

విద్యుత్ బిల్లుల భారం భరించలేం..



గిద్దలూరు మండలం పొదలకుంటపల్లె గ్రామంలో నివాసం ఉంటున్న గడ్డం తిరుపతి గిద్దలూరు పట్టణంలో చిరువ్యాపారం చేసుకుంటూ జీవిస్తుంటాడు. తాను నివాసం ఉండే ఇంటికి గత నెల రూ.400 కరెంటు బిల్లు వస్తే.. డిసెంబర్ నెలలో రూ.550 వచ్చిందని వాపోతున్నాడు. గత నెల కంటే ఈ నెల రూ.150 ఎక్కువగా బిల్లు రావడంపై ఆశ్చర్యపోయాడు. అసలే చలికాలం, వర్షాలు కావడంతో ఇంట్లో ఫ్యాన్లు కూడా వేసుకోకుండా విద్యుత్‌ను ఆదా చేస్తునట్టు చెప్పారు. అలాంటిది కరెంట్ బిల్లు ఎక్కువ ఎందుకు వచ్చిందని విద్యుత్‌శాఖ అధికారులను ప్రశ్నించడంతో తమకు ఏమి తెలియదని సమాధానం చెప్పారంటున్నారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో కరెంటు బిల్లు చెల్లించారు. సామాన్యుడు ఉపయోగించే విద్యుత్‌పై భారం మోపడం సరికాదని తిరుపతి అంటున్నాడు. పేదలను ఆర్థికంగా కుంగదీసే కరెంట్ బిల్లులను తక్షణమే తగ్గించి ఆదుకోవాలని కోరుతున్నాడు.

ఇదీ.. ప్రస్తుతం జిల్లాలో సామాన్య ప్రజల పరిస్థితి. మండు వేసవిలోనే కాదు చలికాలంలోనూ కరెంటు బిల్లులు షాక్ కొడుతున్నాయి. వివిధ రకాల పేర్లతో చార్జీలు రెట్టింపు చేయడంతో సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రెక్కాడితేగానీ డొక్కాడని నిరుపేదలు కరెంటు బిల్లులు కట్టలేక చీకట్లో మగ్గిపోతున్నారు. పొద్దంతా కష్టపడి పొట్ట నింపుకునే పేదలు ఇప్పుడు కరెంటు బిల్లు చెల్లించడానికి వారం రోజుల పాటు కష్టపడాల్సిన దుస్థితి ఏర్పడింది. సార్వత్రిక ఎన్నికలకు ముందు మమ్మల్ని గెలిపిస్తే విద్యుత్ చార్జీలు పెంచేది లేదని హామీ ఇచ్చిన చంద్రబాబు అండ్ కో.. గెలిచి ఆరు నెలల్లోనే బిల్లులు పెంచి మోసం చేశారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



స్విచ్చేస్తే షాకే!

- దోడ్డిదారిన విద్యుత్ చార్జీలు పెంచిన కూటమి సర్కార్
- సర్దుబాటు చార్జీల పేరుతో పెను భారం
- జిల్లా ప్రజలపై సుమారు రూ.34 కోట్ల అదనపు భారం
- బిల్లులు చెల్లించలేక అల్లాడిపోతున్న జనం
- ఎన్నికలకు ముందు ఒక మాట, గద్దెనెక్కిన తర్వాత మరోమాట

సాక్షి ప్రతినిధి, ఒంగోలు/ఒంగోలు టౌన్: సర్దుబాటు, ట్రూ అప్ చార్జీల పేరుతో కూటమి సర్కార్ పైసా వసూళ్లకు పాల్పడుతోంది. నిరుపేద ప్రజలను దృష్టిలో ఉంచుకుని గత జగన్ సర్కార్ 100 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగించిన వారిపై ఎలాంటి భారం వేసేది కాదు. ఇప్పుడు మినిమం కరెంటు బిల్లుకు సైతం సర్దుబాటు చార్జీలు వేస్తున్నారు. కేవలం ఒకే ఒక్క బల్బు ఉపయోగించే పూరి గుడిసెలను సైతం కనికరించడం లేదు. ఎస్సీ, ఎస్టీలకు ఉచిత విద్యుత్ ఇవ్వడం లేదు. రైతుల ఉచిత విద్యుత్‌పై కూడా కన్నేశారని పేరు చెప్పడానికి ఇష్టపడని అధికారి ఒకరు చెప్పారు. పారిశ్రామికవేత్తలకు కోట్లాది రూపాయల విద్యుత్ రాయితీలిస్తున్న కూటమి పాలకులు.. భరోసా పింఛన్ తీసుకుంటూ రేషన్ బియ్యం తిని బతుకుతున్న పేదల నుంచి కూడా ముక్కుపిండి విద్యుత్ చార్జీలు వసూలు చేస్తుండటంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లాలో గృహావసరాలకు వినియోగించే విద్యుత్ కనెక్షన్లు 10,22,844 ఉన్నాయి. వాణిజ్య అవసరాలకు వినియోగించే విద్యుత్ కనెక్షన్లు 1,04,728 కనెక్షన్లు ఉన్నాయి. మొత్తం కలిపి 11,27,572 కనెక్షన్లు ఉన్నాయి. ఇవికాకుండా ఒంగోలు, కొత్తపట్నం, సింగరాయకొండ, టంగుటూరు, నాగులుప్పలపాడు మండలాల్లో ఆక్వా సాగు చేస్తున్నారు. రొయ్యల చెరువులకు సంబంధించి 12 వేల విద్యుత్ మీటర్లు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన ఈ ఆరు నెలల్లో రెండు సార్లు సర్దుబాటు చార్జీలు, ట్రూ అప్ చార్జీల పేరుతో దొడ్డిదారిన విద్యుత్ చార్జీలు పెంచింది. మొదటిసారి జిల్లాపై సుమారు రూ.9 కోట్ల భారం పడినట్లు అంచనా. ఇప్పుడు రెండోసారి పెంచిన విద్యుత్ చార్జీలతో రూ.25 కోట్లకుపైగా భారం పడిందని ప్రజాసంఘాలు చెబుతున్నాయి. ఈ లెక్కన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 6 నెలల కాలంలోనే రూ.34 కోట్ల వరకు భారం పడిందని చెప్పవచ్చు. ఇక జనవరిలో మళ్లీ చార్జీలు పెంచనున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఈసారి మరెన్ని కోట్లు ముక్కు పిండి వసూలు చేయనున్నారో అని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు.

ప్రస్తుతం ఒంగోలు నగరంలో కొన్ని కరెంటు బిల్లులను పరిశీలిస్తే కనీసం 25 నుంచి 50 శాతం వరకు రెట్టింపు బిల్లులు వచ్చాయి. గృహావసరాల బిల్లుల కంటే వాణిజ్య అవసరాలకు సంబంధించిన బిల్లులు మరింత ఎక్కువగా వచ్చాయి. దీంతో వ్యాపారులు సైతం భయపడిపోతున్నారు.

ఎస్సీ, ఎస్టీలకు మొండిచేయి...

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అమలు చేశారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం రాగానే దాన్ని అటకెక్కించి ఎస్సీ, ఎస్టీలను ముంచేసింది. ప్రస్తుతం ఎస్సీ, ఎస్టీలు కూడా విద్యుత్ బిల్లులు చెల్లించాల్సిన పరిస్థితి వచ్చింది. వారి నుంచి కూడా సర్దుబాటు చార్జీలను ముక్కుపిండి వసూలు చేస్తుండటంతో దళిత బహుజనులు మండిపడుతున్నారు.

రైతుల ఉచిత విద్యుత్‌కు మంగళం...

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి రైతులకు ఉచిత విద్యుత్ హామీ ఇచ్చినప్పుడు ఎద్దేవా చేసిన చంద్రబాబు.. ఇప్పుడు దాని మీద కూడా కన్నేసినట్లు తెలుస్తోంది. రైతులకు ఇస్తున్న ఉచిత విద్యుత్ పథకానికి నేరుగా గండికొడితే వ్యతిరేకత వస్తుందన్న భయంతో దొడ్డిదారులు వెతుకుతున్నారని సమాచారం.

కరెంటు బిల్లులు చెల్లించలేక సామాన్యుల ఇబ్బందులు



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రెండు సార్లు కరెంటు చార్జీలు పెంచింది. జిల్లా ప్రజలపై రూ.30 కోట్లకుపైగా భారం వేసింది. దీంతో సామాన్య ప్రజలతో పాటుగా ఆక్వా రంగం, చిన్న పరిశ్రమలు తీవ్రంగా దెబ్బతినే అవకాశం ఉంది. సూపర్ సిక్స్ ద్వారా ప్రజా సంక్షేమ పథకాలు అమలు చేస్తామంటూ అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఈ ఆరు నెలల్లో కనీసం ఒక్క సంక్షేమ పథకాన్ని కూడా అమలు చేయలేదు. కానీ, కోట్ల రూపాయల భారాన్ని నెత్తిన వేస్తోంది. కూటమి పాలనలో జిల్లా ప్రజలకు మేలు జరగకపోగా ఆర్థికంగా భారం వేయడం అన్యాయం.

– జీవీ కొండారెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు

వాడకం తగ్గినా.. బిల్లు పెరిగింది



నెలనెలా కరెంటు చార్జీలు పెరుగుతూ పోతున్నాయి. పొలం పనులు చేసుకునే మాలాంటి వారికి కరెంటు బిల్లులు భారంగా మారాయి. గత నెలలో రూ.250 వచ్చిన కరెంటు బిల్లు.. ఈ నెలలో రూ.297 వచ్చింది. గత నెలతో పోలిస్తే కరెంటు వినియోగం బాగా తగ్గింది. అలాంటప్పుడు బిల్లు తగ్గాలిగానీ ఎలా పెరుగుతుంది. అప్పులతో సతమతమవుతున్న రైతులను ఆదుకోవాల్సిన ప్రభుత్వం కరెంటు బిల్లుల రూపంలో ఇంకా ఇబ్బంది పెట్టడం సరికాదు.

– నందిరెడ్డి సుబ్బారెడ్డి, రైతు, అంకభూపాలెం, అర్ధవీడు మండలం

ప్రతినెలా విద్యుత్ బిల్లుల భారం



కొమరోలులో నివాసం ఉంటూ చిరువ్యాపారం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నా. రెండు నెలలుగా కరెంటు బిల్లులు ఎక్కువ మోతాదులో వస్తున్నాయి. గత నెలలో రూ.470 రాగా, ఈ నెలలో రూ.630 వచ్చింది. ఇంట్లో విద్యుత్ దీపాలు, ఫ్యాన్లు మాత్రమే ఉన్నాయి. చలికాలం కావడంతో ఫ్యాన్లు కూడా ఉపయోగించడం లేదు. విద్యుత్ వాడకం తగ్గినా బిల్లు అదనంగా రావడంతో భారం పడుతోంది.

– దివాన్‌బాషా, కొమరోలు

నేడు పోరు బాట..

కూటమి సర్కార్ విద్యుత్ చార్జీల పెంపునకు నిరసనగా వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు కరెంట్ చార్జీల బాదుడుపై అన్ని నియోజకవర్గాల్లో ఆందోళనకు పార్టీ శ్రేణులు సిద్ధమయ్యాయి. జిల్లా కేంద్రం ఒంగోలు నగరంలో పార్టీ ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెవిరెడ్డి భాస్కరరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు జూపూడి ప్రభాకరరావు, బత్తుల బ్రహ్మానందరెడ్డి, ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరు రవిబాబు ఆధ్వర్యంలో భారీ ఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టనున్నారు. తొలుత చర్చి సెంటర్‌లోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి అక్కడి నుంచి అన్నవరప్పాడు 3వ లైన్ వద్ద ఉన్న విద్యుత్ భవన్ వరకూ భారీ ర్యాలీ నిర్వహించనున్నారు. ప్రజలపై మోపుతున్న కరెంటు చార్జీలు వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ అధికారులకు వినతిపత్రాన్ని అందజేయనున్నారు. దర్శి నియోజకవర్గ కేంద్రంలో ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్ని మండలాల వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో గడియార స్తంభం సెంటర్ నుంచి విద్యుత్ సబ్‌స్టేషన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించనున్నారు. పార్టీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి, పీఏసీ సభ్యుడు డాక్టర్ ఆదిమూలపు సురేష్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 9 గంటలకు సింగరాయకొండలోని పార్టీ క్యాంపు కార్యాలయం నుంచి బయలుదేరి మార్గ మధ్యంలో అన్ని మండలాల వారిని కలుపుకుని కొండపి చేరుకుంటారు. అక్కడ నిరసన కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. యర్రగొండపాలెం ఎమ్మెల్యే, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో అన్ని మండలాల నాయకులను కలుపుకుని మార్కాపురం రోడ్డులో ఉన్న విద్యుత్ సబ్ డివిజనల్ కార్యాలయం వరకు పెద్దఎత్తున ర్యాలీ నిర్వహిస్తారు. మాజీ ఎమ్మెల్యే, పార్టీ మార్కాపురం ఇన్‌చార్జి అన్నా రాంబాబు నేతృత్వంలో నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాల పార్టీ నాయకులను కలుపుకుని తర్లుపాడు రోడ్డులోని పార్కు నుంచి విద్యుత్ డీఈ కార్యాలయం వరకూ ర్యాలీ జరుగుతుంది. పార్టీ గిద్దలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి ఆధ్వర్యంలో గిద్దలూరు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించి విద్యుత్ చార్జీలు తగ్గించాలని కోరుతూ అధికారులకు వినతిపత్రాన్ని అందజేస్తారు. మాజీ మంత్రి, పార్టీ సంతనూతలపాడు ఇన్‌చార్జి మేరుగు నాగార్జున ఆధ్వర్యంలో అన్ని మండలాల నాయకులు, కార్యకర్తలతో సంతనూతలపాడు పట్టణంలో భారీ ర్యాలీ అనంతరం అధికారులకు వినతిపత్రాన్ని ఇస్తారు. పార్టీ కనిగిరి ఇన్‌చార్జి దద్దాల నారాయణయాదవ్ ఆధ్వర్యంలో కనిగిరి చెక్‌పోస్టు సెంటర్‌లోని వైఎస్సార్ విగ్రహం వద్ద నుంచి కందుకూరు రోడ్డు (బస్ డిపో వద్ద)లోని డీఈ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించనున్నారు.

పరిశ్రమలకూ సర్‌చార్జీల పోటు

- సర్ చార్జీలు, ట్రూ అప్ చార్జీల పేరుతో పరిశ్రమలపై చంద్రబాబు బాదుడే బాదుడు
- 2022–23 సంవత్సరానికి సంబంధించిన విద్యుత్ వినియోగంపై నేడు అదనపు భారం
- జిల్లాలో సుమారు 3 వేల పరిశ్రమలపై రూ.4.5 కోట్లు వసూలు
- కరెంటు బిల్లులు చెల్లించలేక మూతబడుతున్న పరిశ్రమలు



చీమకుర్తి: 'పరిశ్రమలు పెట్టండి.. యువతకు ఉపాధి కల్పించండి.. ఎవరు ఎక్కువ ఉద్యోగాలు కల్పిస్తే వారికి ఎక్కువ రాయితీలు అందిస్తాం'... గత ఎన్నికలకు ముందు నారా చంద్రబాబు, ఆయన తనయుడు నారా లోకేష్ పరిశ్రమల యజమానులకు చెప్పిన మాటలివి. వారు పాల్గొన్న ప్రతి బహిరంగ సభలోనూ ఇలాంటి భరోసాలు ఎన్నో ఇచ్చారు. తీరా అధికారంలోకి వచ్చిన ఆరు నెలలకే పరిశ్రమల యజమానులకు చుక్కలు చూపించేలా కరెంటు చార్జీలు పెంచారు. సర్ చార్జీలు, ట్రూ అప్ చార్జీల పేరుతో షాక్‌ల మీద షాక్‌లు ఇస్తున్నారు. ఎప్పుడో రెండు సంవత్సరాల క్రితం 2022–23 ఆర్థిక సంవత్సరంలో కరెంటు వాడుకున్న పరిశ్రమలకు ఫ్యూయల్ అండ్ పవర్ పర్చేస్ కాస్ట్ అడ్జస్ట్‌మెంట్ (ఎఫ్‌పీపీసీఏ) పేరుతో రాష్ట్రం మొత్తం మీద రూ.600 కోట్లను విద్యుత్ వినియోగదారుల నుంచి వసూలు చేయాలని లక్ష్యంగా కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. అందులో తొలివిడతగా రూ.1400 కోట్లు వసూలు చేసేందుకు ఉత్తర్వులు జారీ చేసింది. దానిని నాలుగు క్వార్టర్లుగా విభజించారు. మొదటి క్వార్టర్‌లో యూనిట్‌కు రూ.1.4789, రెండో క్వార్టర్‌కు రూ.0.4557, మూడో క్వార్టర్‌కు రూ.1.5040, నాలుగో క్వార్టర్‌కు రూ.3.2704 చొప్పున వసూలు చేయనుంది. ఇది చాలదన్నట్లుగా 2014–19లోని చంద్రబాబు పాలనా కాలానికి కూడా ట్రూ అప్ చార్జీల పేరుతో యూనిట్‌కు రూ.0.60 వంతున వసూలు చేయనుంది.

జిల్లాలో 3 వేల పరిశ్రమలపై అదనపు భారం...

పరిశ్రమల ఏర్పాటులో రాష్ట్ర వ్యాప్తంగా ప్రకాశం జిల్లా మొదటి రెండుమూడు స్థానాల్లో ఉంటుంది. వాటిలో ప్రధానమైన పరిశ్రమలలో చీమకుర్తి, రామతీర్థం, బూదవాడ, మర్రిచెట్లపాలెం, మద్దిపాడు, బల్లికురవ, మార్టూరు ప్రాంతాలలోని దాదాపు 2 వేల గ్రానైట్ ఫ్యాక్టరీలు ఉన్నాయి. రామతీర్థంతో పాటు ఇతర ప్రాంతాలలో 120 వరకు కంకర మిల్లులు ఉన్నాయి. 90 వరకు గ్రానైట్ క్వారీలు ఉన్నాయి. వాటితో పాటు గుండ్లాపల్లి, త్రోవగుంట, పేర్నమిట్ట, మార్కాపురం, సింగరాయకొండ తదితర ప్రాంతాలలో ఎంఎస్‌ఎంఈ పరిశ్రమలు కలుపుకుని సుమారు 3 వేల పరిశ్రమలు ఉన్నట్లు అంచనా. గ్రానైట్ ఫ్యాక్టరీని మూడు షిఫ్టులలో నడిపినప్పుడు రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు కరెంటు బిల్లుల వస్తుంటాయి. సర్‌చార్జి, ట్రూ అప్ చార్జీల పేరుతో వసూలు చేస్తున్న అదనపు బాదుడు కారణంగా మూడు షిఫ్టులలో నడిపే ఫ్యాక్టరీలకు అదనంగా దాదాపు రూ.15 వేల నుంచి రూ.25 వేల వరకు అదనపు భారం పడుతుంది. ఇలా జిల్లాలోని 3 వేల పరిశ్రమలపై సరాసరిన ఒక్కో పరిశ్రమకు రూ.10 వేల వంతున లెక్కలు కట్టినా రూ.4 కోట్ల నుంచి రూ.5 కోట్ల మధ్య అదనపు భారం చెల్లించాల్సి వస్తోంది. దానిని క్వార్టర్ల వారీగా వసూలు చేసేందుకు విద్యుత్ శాఖాధికారులు నెలనెలా చెల్లించే కరెంటు బిల్లులో గత రెండు నెలల నుంచి వసూలు చేస్తుండటంతో పరిశ్రమల యజమానులు వాపోతున్నారు.

బాబు అంటే బాదుడే..!

- విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని చెప్పి పెంచారు
- నిరసనగా ప్రజల కోసం వైఎస్సార్ సీపీ పోరాటం
- నేడు జిల్లా వ్యాప్తంగా ర్యాలీలను జయప్రదం చేయాలి
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ పిలుపు

దర్శి: కూటమి ప్రభుత్వం ప్రస్తుతం అమలు చేస్తున్న విద్యుత్ చార్జీల తీరు చూస్తుంటే బాబు అంటే బాదుడే అని అర్థమవుతోందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ విమర్శించారు. స్థానిక వైఎస్సార్ సీపీ దర్శి నియోజకవర్గ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. దర్శి గడియారం స్తంభం సెంటర్ నుంచి విద్యుత్ ఈఈ కార్యాలయం వరకు శుక్రవారం నిర్వహించనున్న పోరు బాట నిరసన ర్యాలీ పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, వెంకాయమ్మ మాట్లాడుతూ విద్యుత్ చార్జీల పెంపునకు నిరసనగా వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నేడు జిల్లా వ్యాప్తంగా నిర్వహించనున్న నిరసన ర్యాలీలను జయప్రదం చేయాలని పార్టీ శ్రేణులు, ప్రజలను కోరారు. రాష్ట్రంలో విద్యుత్ చార్జీల బాదుడుపై ప్రజల పక్షాన పోరాడేందుకు వైఎస్సార్ సీపీ రోడ్డుమీదకు వస్తోందన్నారు. చంద్రబాబు ఎన్నికల ముందు సూపర్ సిక్స్ అంటూ నానా రకాల హామీలిచ్చి.. నేడు ఒక్కటంటే ఒక్కటీ అమలు చేయలేదన్నారు. తాము అధికారంలోకి వస్తే ఐదేళ్ల పాటు విద్యుత్ చార్జీలు పెంచమని చెప్పడమే కాకుండా తగ్గిస్తామని కల్లబొల్లి మాటలు చెప్పారన్నారు. ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా రూ.15,485 కోట్లకుపైగా విద్యుత్ బిల్లుల రూపంలో ప్రజలపై భారం మోపారన్నారు. ఎన్నికల ముందు ఏం చెప్పారు.? ఇప్పుడు ఏం చేస్తున్నారంటూ చంద్రబాబును ప్రశ్నించారు. ఒక్కో యూనిట్‌కు రూ.2.50 భారం పడుతోందని అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయకపోగా, నిరుపేదలైన ఎస్సీ, ఎస్టీ, బీసీలపై భారం వేస్తే వారు బతికేదెలా అని ప్రశ్నించారు. దుర్మార్గపు ఆలోచనలు చేయకుండా ఇచ్చిన హామీలు నెరవేర్చాలని కూటమి ప్రభుత్వాన్ని, చంద్రబాబును డిమాండ్ చేశారు. నేడు నిరసన ర్యాలీల్లో నియోజకవర్గాల ప్రజలు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. విలేకరుల సమావేశంలో దర్శి, కురిచేడు మండలాల వైఎస్సార్ సీపీ కన్వీనర్లు వెన్నపూస వెంకటరెడ్డి, యన్నాబత్తిన సుబ్బయ్య, గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ కుమ్మిత అంజిరెడ్డి, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు గాలిమూటి దేవప్రసాద్, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు కొల్లా ఉదయ్ భాస్కర్, జెడ్పీటీసీ నుసుం వెంకటనాగిరెడ్డి, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు కేసరి రాంభూపాల్ రెడ్డి, కౌన్సిలర్లు మేడం మోహన్‌రెడ్డి, తుళ్లూరి బాబూరావు, జగన్నాథం మోహన్‌బాబు, సాగర్ ప్రాజెక్ట్ మాజీ వైస్ చైర్మన్ సద్ది పుల్లారెడ్డి, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ కేవీ రెడ్డి, మాజీ ఎంపీపీ ఇత్తడి దేవదానం, నాయకులు పాశం జయసింహారావు, పాలెపోగు డగ్లస్, మజ్జువలి, చెరుకూరి జగన్, తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్ బిల్లుల పై నిరసన ర్యాలీ పోస్టర్లు విడుదల చేస్తున్న బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, బూచేపల్లి వెంకాయమ్మ, వైఎస్సార్ సీపీ నాయకులు

జోరు వాన..!

ఒంగోలు అర్బన్: బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో గురువారం జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురిసాయి. ఒంగోలు నగరంతో పాటు పలు పట్టణాలు, గ్రామాల్లో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఒంగోలు నగరంలో పారిశుధ్య లోపం కారణంగా పలుచోట్ల కాలువల్లోని మురుగునీరు రోడ్లపైకి చేరింది. ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి పనులపై బయట తిరిగే ప్రజలు అవస్థపడ్డారు. జిల్లాలో పలు చోట్ల పంట నష్టం కూడా జరిగినట్లు తెలుస్తోంది. పామూరు, దొనకొండ, కురిచేడు, ముండ్లమూరు, ఒంగోలు, కొనకనమిట్ల, టంగుటూరు మండలాల్లో 6,591 మంది రైతులకు సంబంధించి 566 హెక్టార్లలో వరి, 2,206 హెక్టార్లలో మినుము పంట, శనగ 167, పొగాకు 590, అలసంద 2,950 హెక్టార్లలో పంట నష్టం జరిగినట్లు అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. మొత్తం 6,481 హెక్టార్లలో పంట నష్టం జరిగినట్లు తెలిపారు.

కొత్తపట్నం మండలంలో అత్యధికంగా 52.6 మిల్లీమీటర్లు

జిల్లాలో గురువారం 12.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదవగా, అత్యధికంగా కొత్తపట్నం మండలంలో 52.6 మిల్లీమీటర్లు నమోదైంది. అత్యల్పంగా రాచర్ల మండలంలో 0.6 మిల్లీమీటర్లు నమోదైంది. మండలాల వారీగా జరుగుమల్లి మండలంలో 38.4 మిల్లీమీటర్లు, టంగుటూరు 38.2, ఒంగోలు 32, కొండపి 31.6, సంతనూతలపాడు 24.4, పొన్నలూరు 23.6, సింగరాయకొండ 23, మర్రిపూడి 16.2, మార్కాపురం 16, యర్రగొండపాలెం 12.6, చీమకుర్తి 12, పెద్దారవీడు 11.8, కొనకనమిట్ల 11.2, కనిగిరి 10.4, త్రిపురాంతకం 8.8, దొనకొండ 8.4, మద్దిపాడు, వెలిగండ్ల 8.2, దోర్నాల 8, కంభం 7.8, కురిచేడు 7.2, తర్లుపాడు 7, పొదిలి 6.8, దర్శి 5.6, హనుమంతునిపాడు 5.4, పామూరు, బేస్తవారిపేట 4.6, అర్ధవీడు 4, పెదచెర్లోపల్లి 3.2, సీఎస్ పురం 2.4, ముండ్లమూరు, నాగులుప్పలపాడు 1.8, గిద్దలూరు 1.2, తాళ్లూరు, పుల్లలచెరువు 1, కొమరోలు 0.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

క్లుప్తంగా

తొలగించిన కార్యకర్తలను విధుల్లోకి తీసుకోవాలి


డీఎంహెచ్‌ఓను కలిసి అభినందిస్తున్న యూనియన్ నేతలు

ఒంగోలు టౌన్: ఇటీవల విధుల నుంచి తొలగించిన పురుష ఆరోగ్య కార్యకర్తలను తిరిగి తీసుకోవాలని యునైటెడ్ మెడికల్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాళ్లూరి వెంకటేశ్వర్లు కోరారు. నూతనంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ తెలగతోటి వెంకటేశ్వర్లును యూనియన్ నాయకులు గురువారం అభినందించారు. ఈ సందర్భంగా తాళ్లూరి మాట్లాడుతూ... 20 ఏళ్లకు పైగా విధులు నిర్వర్తిస్తున్న పురుష ఆరోగ్య కార్యకర్తలను ఉన్నపళంగా తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు. సచివాలయ ఆరోగ్య కార్యకర్తలకు పదోన్నతలు కల్పించాలని, స్టాఫ్ నర్సులుగా శిక్షణ పొందిన ఏఎన్ఎంలకు స్టాఫ్ నర్సులుగా పదోన్నతులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. డీఎంహెచ్‌ఓను కలిసిన వారిలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు వై. సురేష్, కార్యదర్శి కె. శ్రీధర్‌బాబు, కోశాధికారి జి. నాగేశ్వరరావు, పి. మోహన్‌రావు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు, నగర కార్యదర్శి టి. మహేష్ పాల్గొన్నారు.

నా అనుమతి లేకుండా వీడియో తీస్తావా?

- రిపోర్టర్‌పై జేసీ ఆగ్రహం

బేస్తవారిపేట: బేస్తవారిపేటలో అనంతపురం-అమరావతి హైవే పక్కన గురువారం సాయంత్రం స్థానికులతో మాట్లాడుతున్న సమయంలో జేసీ రోణంకి గోపాలకృష్ణ ఓ విలేకరిపై కన్నెర్రజేశారు. అధికారిక పర్యటనలో భాగంగా కంభం మండలం జంగంగుంట్లలో రెవెన్యూ సభకు జేసీ హాజరయ్యారు. అనంతరం బేస్తవారిపేటలో హైవేపై స్థానికులతో మాట్లాడేందుకు వచ్చారు. ఈ సమయంలో అక్కడే ఉన్న ఓ ఎలక్ట్రానిక్ మీడియా రిపోర్టర్ వీడియో తీస్తుండగా "ఎందుకు వీడియో తీస్తున్నావు. నా అనుమతి లేకుండా ఎలా వీడియో తీస్తున్నావ్" అని జేసీ గద్దించారు. పక్కనే ఉన్న తహసీల్దార్‌కు చెప్పి ఆ రిపోర్టర్ మొబైల్లో ఉన్న వీడియోను డిలీట్ చేయించారు. మీడియాపై జేసీ ఆగ్రహించిన వీడియో సోషియల్ మీడియాలో వైరల్‌గా మారింది.

అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోండి

- చర్యలు తీసుకోవాలని కార్యదర్శులకు తహసీల్దార్ నోటీసులు

సాక్షి ఎఫెక్ట్..

పొన్నలూరు: మండలంలోని పెద వెంకన్నపాలెం, తిమ్మపాలెం గ్రామాల్లో వాగుపోరంబోకు, బండిబాట ప్రభుత్వ స్థలాలు ఆక్రమించుకొని టీడీపీ నాయకులు అక్రమంగా గోకులం షెడ్, పొగాకు బ్యారన్‌లు నిర్మిస్తున్నారు. ప్రభుత్వ స్థలంలోని టీడీపీ నాయకులు నిర్మిస్తున్న అక్రమ కట్టడాలపై గురువారం సాక్షిలో ×తమ్ముళ్ల కన్ను పడితే× అనే శీర్షికన ప్రచురితమైంది. దీనికి స్పందించిన పొన్నలూరు తహసీల్దార్ పుల్లారావు రెండు గ్రామాల్లోని ప్రభుత్వ స్థలాల్లో నిర్మిస్తున్న అక్రమ కట్టడాలను నిలిపివేసి చర్యలు తీసుకోవాలని ఆయా పంచాయతీ కార్యదర్శులకు నోటీసులు జారీ చేశారు. రెండు గ్రామాల్లోని వాగుపోరంబోకు, బండిబాట భూములను ఆక్రమించి అక్రమ కట్టడాలు నిర్మిస్తే చర్యలు తీసుకోవాలని కోర్టు ఆదేశాలు ఉన్నాయని, అలాగే ఈ భూములు పంచాయతీ పరిధిలోకి వస్తున్నందునా పంచాయతీ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

జింకా.. తిరుగుపో ఎంచక్కా!

- పొలాల్లో రైతులకు పట్టుబడిన 4 నెలల జింక పిల్ల
- శ్రీశైలం పార్కుకు తరలించిన అటవీశాఖ అధికారులు


జింక పిల్లను పార్కుకు తరలిస్తున్న అటవీశాఖ సిబ్బంది

పెద్దదోర్నాల: ఒంగోలు సమీపంలోని పొలాల్లో రైతులకు పట్టుబడిన నాలుగు నెలల జింక పిల్లను గురువారం అటవీశాఖ అధికారులు నంద్యాల జిల్లా శ్రీశైలం ప్రాజెక్టు కాలనీ(సుండిపెంట)లోని జింకల పార్కుకు తరలించారు. రైతులు అందించిన సమాచారంతో అటవీశాఖ బీట్ ఆఫీసర్ శశిభూషణ్‌యాదవ్, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ మహబూబ్‌బాషా సంఘటనా స్థలానికి చేరుకుని జింకను స్వాధీనం చేసుకున్నారు. ప్రత్యేక వాహనంలో శ్రీశైలం ప్రాజెక్టు కాలనీలోని జింకల పార్కులో సురక్షితంగా వదిలిపెట్టారు.


కంభంలో నేల కొరిగిన వరి పైరు


ఎల్‌కోట పంచాయతీ పరిధిలో కల్లంలో తడిసిన ఎండుమిర్చి


పొన్నలూరు : పొగ తోటలో నిల్వ చేరిన వర్షం నీరు


కనిగిరి : తడిసిన వరి కంకులు చూపుతున్న రైతు

ఆరుగాలం కష్టం.. వర్షార్పణం!

- ముసురు, జడివానతో జిల్లాలో రబీ పంటలన్నీ నాశనం
- పశ్చిమ ప్రకాశంలో మెట్టపైర్లకు అపార నష్టం
- పప్పుశనగ చేతికి రాదని రైతుల ఆందోళన
- పూత రాలుతున్న కంది.. మడ్డి కారుతున్న పొగాకు
- కల్లాల్లో తడిసి బూజు పడుతున్న మిరప కాయలు
- పంటలకు తెగుళ్ల ముప్పు మరింత పెరిగే ప్రమాదం
- మరో రెండు రోజులు వర్షాలు కొనసాగే అవకాశం
- వాన తగ్గితేనే నష్టం అంచనా కొలిక్కి..


బూజు పట్టిన మిర్చి


పొదిలి : ఆముదాలపల్లిలో నీట మునిగిన వరి ఓదెలు

కంభం/ఒంగోలు సిటీ:

పంటలు చేతికొస్తే పండగ చేద్దామనుకున్న రైతుల కలలను అకాల వర్షాలు చెరిపేశాయి. వర్షాల నేపథ్యంలో జిల్లాలో రబీ సీజన్ ఆలస్యంగా ప్రారంభం కాగా ఆ తర్వాత వరుసగా ఏర్పడిన అల్పపీడనాలు పంటల దిగుబడిని ప్రశ్నార్థకం చేశాయి. ఓ వైపు తెగుళ్లు, మరో వైపు వర్షాలు అన్నదాతలను కకావికలం చేస్తున్నాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో జిల్లాలో గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో పంటలు దెబ్బతినడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో 3,69,637 ఎకరాల వ్యవసాయ సాగు భూమి ఉండగా 1,44,582 ఎకరాల్లో రైతులు పంటలు సాగు చేస్తున్నారు. అందులో పప్పుశనగ 86,859 ఎకరాల్లో సాగు చేయగా మిగిలిన 60 వేల ఎకరాల్లో ఇతర పంటలు వేశారు. ప్రస్తుతం శనగ పంట పూత దశలో, మిర్చి, పొగాకు పూత, కోత దశలో, మినుము కోత దశలో ఉన్నాయి. వరి పైరు సగానికి పైగా కోత కోయగా మిగిలిన పంట వర్షానికి దెబ్బతింది. శనగ పంట పూత దశలో వర్షం కురుస్తుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కోత దశలో ఉన్న మిర్చి నాణ్యత దెబ్బతింటుండగా, కల్లాల్లో ఆరబెట్టిన మిర్చికి బూజు పడుతోంది. పొగాకు మడ్డి కారుతుండటంతో నాణ్యత తగ్గుతోందని రైతులు కలవరపాటుకు గురవుతున్నారు. వర్షం ఇలాగే మరో రెండు రోజులు పడితే శనగ పంట పూర్తిగా పనికి రాకుండా పోతుందని రైతులు మదనపడుతున్నారు.

ఖరీఫ్‌లో కన్నీళ్లు.. రబీలోనూ అవే కష్టాలు

కూటమి ప్రభుత్వం వచ్చాక ఖరీఫ్ సీజన్‌లో వ్యవసాయం తుడిచిపెట్టుకుపోయింది. ఎలాగోలా రబీ సీజన్‌లో అయినా గట్టెక్కుదామనుకున్న రైతుల ఆశలు వరుస అల్పపీడనాలతో అడియాసలయ్యాయి. సాధారణంగా శీతాకాలంలో కొన్ని పంటలు డిసెంబర్ సమయానికి కళకళలాడుతుండేవి. కానీ వర్షాలు కురుస్తుండటంతో చేలు కళ తప్పాయి. అల్పపీడనం కొనసాగుతోందని, మరో రెండు రోజులపాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు ప్రకటించడంతో పంటలు కాపాడుకునేందుకు రైతులు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు.

బీమాపై చేతులెత్తేసిన కూటమి సర్కారు

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన ఈ ఆరు నెలల్లో రైతులకు చేయూతనివ్వకపోగా వాళ్లకు ధైర్యం చెప్పే ప్రయత్నం కూడా చేయలేకపోయింది. గత ప్రభుత్వంలో అమలు చేసిన ఉచిత పంటల బీమాను సైతం తొలగించి.. రైతులే ప్రీమియం చెల్లించుకోవాలని ఆదేశించింది. ఆర్థిక స్థోమత లేని రైతులు పంటల బీమా చెల్లించేందుకు విముఖత చూపుతున్నా.. సర్కారు మాత్రం గడువు పొడిగిస్తూ సన్నాయి నొక్కులు నొక్కుతోంది. ప్రతి రైతుకు అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.20 వేలు ఇస్తామన్న హామీని సైతం కూటమి ప్రభుత్వం అటకెక్కించడంతో పెట్టుబడి కోసం రైతులు అప్పు చేస్తున్నారు.


ముండ్లమూరు: నీట మునిగిన వరి ఓదెలను ఒడ్డుకు చేరుస్తున్న రైతు


దొనకొండ : బూజు పట్టిన కాయలు చూపిస్తున్న రైతులు


కొనకనమిట్ల : నాయుడుపేటలో ముసురులోనే అలసంద కోస్తున్న కూలీలు

వేధింపులు తాళలేక నవ వధువు ఆత్మహత్య


అమూల్య పెళ్లిఫొటో(ఫైల్)


అమూల్య మృతదేహం

సింగరాయకొండ: అత్తామామ, భర్త వేధింపులు తట్టుకోలేక నవ వధువు ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన మండలంలోని శానంపూడి గ్రామంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం...జరుగుమల్లి ఎస్సీ కాలనీకి చెందిన పాలపర్తి అమూల్యకు గత నెల 17న శానంపూడి గ్రామానికి చెందిన తగరం గోపీకృష్ణతో వివాహమైంది. గోపి రొయ్యల కంపెనీలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. పెళ్లయిన కొన్ని రోజులకే అమూల్యకు అత్తా మామలు ఆదిలక్ష్మి, కృపానందం, భర్త గోపీకృష్ణ నుంచి వేధింపులు ఎక్కువయ్యాయి. పెళ్లయిన తరువాత మొదటి పండుగకు పుట్టింటికి వెళతానంటే భర్తతో పాటు అత్తామామ ఒప్పుకోలేదు. బుధవారం క్రిస్మస్ పండుగరోజు అత్తామామలు ఓగూరులో ఉన్న కూతురు వద్దకు వెళ్లారు. ఇంట్లో ఎవ్వరూ లేక పోవడంతో మనస్తాపం చెందిన అమూల్య ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. డ్యూటీ నుంచి రాత్రి 7 గంటలకు ఇంటికి వచ్చిన భర్త గోపి తలుపు తీసి చూడగా అమూల్య ఉరేసుకొని కనిపించింది. గ్రామస్తుల సమాచారంతో పోలీసులు రాత్రి సంఘటనా స్థలాన్ని పరిశీలించి మామ కృపానందం, భర్త గోపిని అదుపులోనికి తీసుకున్నారు. గురువారం ఉదయం అమూల్య మృతదేహాన్ని సీఐ సీహెచ్ హజరత్తయ్య, ఇన్‌చార్జి ఎస్సై బి.మహేంద్ర పరిశీలించి అత్త ఆదిలక్ష్మిని అదుపులోకి తీసుకున్నారు. మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం కందుకూరు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి పోస్టుమార్టంకు తరలించారు. అమూల్య తండ్రి పాలపర్తి చిరంజీవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ హజరత్తయ్య వివరించారు. మృతదేహాన్ని తహసీల్దార్ టి.రవి పరిశీలించారు. అల్లారు ముద్దుగా పెంచుకున్న ఒక్కగానొక్క కూతురు పెళ్లయిన కొద్దిరోజులకే ఆత్మహత్య చేసుకుని మమ్మల్ని విడిచి వెళ్లిపోయిందని తండ్రి చిరంజీవి రోదన చూపరులను కలచివేసింది.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి


మృతి చెందిన మౌలాలి


మృతి చెందిన కృష్ణ

కొమరోలు/బేస్తవారిపేట: గిద్దలూరు నియోజకవర్గంలో గురువారం రాత్రి వేర్వేరు చోట్ల సంభవించిన రెండు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు. కొమరోలు మండలం దద్దవాడ గ్రామ సమీపంలో అమరావతి-అనంతపురం హైవేపై బైక్‌ను ట్రక్ ఢీకొనడంతో ఓ యువకుడు మృత్యువాతపడ్డాడు. రాచర్ల మండలం గుడిమెట్టకు చెందిన సుంకరి మౌలాలి (32) గిద్దలూరు వెళ్లి స్వగ్రామానికి వస్తున్నాడు. అదే సమయంలో బేస్తవారపేట వైపు నుంచి గిద్దలూరు వైపు వెళ్తున్న ట్రక్ దద్దవాడ వద్ద బైక్‌ను ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన మౌలాలిని అంబులెన్స్‌లో గిద్దలూరు వైద్యశాలకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం నర్సరావుపేట తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో త్రిపురాంతకం వద్ద మౌలాలి మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. మృతుడికి భార్య అరుణ ఉంది. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు.

ట్రావెల్ బస్సును ఢీకొని..

ముందు ఉన్న ట్రావెల్స్ బస్సును ఢీకొని ద్విచక్ర వాహనదారుడు మృతి చెందిన సంఘటన బేస్తవారిపేట మండలం పందిళ్లపల్లి సమీపంలో చోటుచేసుకుంది. కొమరోలు కృష్ణ అనే వ్యక్తి గిద్దలూరు మార్కెట్‌లో ఆకుకూరలు విక్రయిస్తుంటాడు. బేస్తవారిపేట మండలంలో ఆకుకూరలు తీసుకుని బైక్‌పై గిద్దలూరు వెళ్తున్న క్రమంలో ముందు ఉన్న ట్రావెల్స్ బస్సును ఢీకొట్టాడు. తలకు తీవ్రగాయాలు కావడంతో గిద్దలూరు ఏరియా వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కాగా చింతలపాలెం వద్ద జరిగిన ఓ ప్రమాదంలో మరొకరికి గాయాలు కాగా మార్కాపురం జీజీహెచ్‌కు తరలించారు.

పేదలకు అండ ఎర్ర జెండా..


ఒంగోలులో ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ నేతలు, కార్యకర్తలు

ఒంగోలు టౌన్: ఎర్ర జెండా నీడలో భూ పోరాటాల ద్వారా లక్షలాది మంది పేదలకు భూమి పంపిణీ చేసినట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య పేర్కొన్నారు. స్థానిక మల్లయ్య లింగం భవనంలో గురువారం సీపీఐ శత జయంతి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ.. దేశంలో ప్రశ్నించేతత్వాన్ని నేర్పింది కమ్యూనిస్టు పార్టేనని చెప్పారు. పార్టీ అధికారంలోకి రాకపోయినప్పటికీ దేశాభివృద్ధిలో పోరాటాల ద్వారా కీలకపాత్ర పోషించిందన్నారు. సీపీఐ రాష్ట్ర నాయకుడు పీజే చంద్రశేఖర్ ప్రసంగిస్తూ.. రానున్న కాలంలో మరిన్ని ప్రజా ఉద్యమాలు చేపడతామని చెప్పారు. సీపీఐ శత జయంతి ఉత్సవాలు ఏడాదిపాటు నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ పేర్కొన్నారు. జాతీయ స్థాయిలో ముగింపు సభలను తెలంగాణాలోని ఖమ్మంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం సీపీఐ కార్యాలయం వద్ద సీనియర్ నాయకులు నల్లూరి వెంకటేశ్వర్లు ఎర్రజెండా ఎగరేశారు. అనంతరం భారీ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ముందుగా నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సభలో డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు, సీపీఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.వెంకటరావు, మాజీ కార్యదర్శి ఎం.వెంకయ్య, నగర కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శి శ్రీరాం శ్రీనివాస్, సీనియర్ అడ్వకేట్ ముదివర్తి రాఘవరావు, ఎంఏ సాలార్, ఎస్‌డీ సత్తార్, సీహెచ్ వెంకటేశ్వర్లు, కారుమూడి నాగేశ్వరరావు, కె.సుబాన్ నాయుడు పాల్గొన్నారు.

చోరీలు..జల్సాలు..!

- బంగారం ముట్టుకోడు.. రోజుకు రూ.10 వేలు దొరికితే చాలు
- సుమారు 100కు పైగా దొంగతనాలు
- చోరీ సొత్తంతా జల్సాలకే ఖర్చు

సింగరాయకొండ: 'వయస్సు 30 సంవత్సరాలు..100కు పైగా దొంగతనాలు..బంగారు ఆభరణాలు ముట్టుకోడు. నగదు మాత్రమే చోరీ చేస్తాడు. రోజుకు రూ.10 వేల నగదు చోరీ చేస్తే చాలనుకుంటాడు. ఎక్కడా వేలిముద్రలు పడకుండా జాగ్రత్త పడతాడు. 2017లో బంగారు ఆభరణాలు చోరీ చేసి పోలీసులకు చిక్కడంతో.అప్పటి నుంచి వాటి జోలికి పోకుండా కేవలం నగదు మాత్రమే చోరీ చేస్తున్నాడు. చోరీ చేసిన నగదును అమ్మాయిలు, ట్రాన్స్‌జెండర్ల సహజీవనానికి ఖర్చు చేస్తాడు. ఒక్కసారి వేసిన దుస్తులు మళ్లీ ధరించడు. ఇది ఈ దొంగ స్పెషాలిటీ'. సింగరాయకొండలో వరుసగా మూడు దొంగతనాలకు పాల్పడిన దుండగుడిని పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం..శ్రీకాకుళం జిల్లా పలాస మండలం పద్మనాభపురం గ్రామానికి చెందిన గొల్లంగి ప్రవీణ్‌కుమార్‌కు అతని తండ్రి కిళ్లీ కొట్టు పెట్టించాడు. అయితే జల్సాలకు అలవాటుపడిన ప్రవీణ్‌కుమార్ దొంగతనాలు చేయడం ప్రారంభించారు. రాత్రిళ్లు తాళం వేసి ఉన్న దుకాణాలనే లక్ష్యంగా చేసుకొని చోరీలకు పాల్పడుతున్నాడు. ఇతనిపై పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం, బాపట్ల జిల్లా ఈపురుపాలెం, మచిలీపట్నం జిల్లా రుస్తుంబాడ, వజ్రపుకొత్తూరు పోలీస్‌స్టేషన్లలో కేసులు ఉన్నాయి. ఈ నెల 22వ తేదీ రాత్రి కందుకూరు రోడ్డు సెంటర్‌లోని షేక్ ముజీబ్ పాత ఇనుము దుకాణంలో తాళాలు పగలకొట్టి చోరీకి పాల్పడ్డాడు. తరువాత ప్రశాంతి థియేటర్ సమీపంలోని బ్రాందీషాపులో చోరీకి పాల్పడ్డాడు. ఈ దుకాణంలో కేవలం రూ.300 మాత్రమే చోరీ చేయగా దుకాణదారులు మాత్రమం రూ.6 వేల నగదు, 2 ఫుల్ బాటిళ్లు, నాలుగు క్వార్టర్స్ పోయాయని ఫిర్యాదు చేశారు. కానీ దొంగ మాత్రం నాకు మద్యం అలవాటు లేదని, మందు బాటిళ్లను తీసుకెళ్లలేదని పోలీసులకు వివరించారు. పాత ఇనుప దుకాణం వద్ద ఉన్న సీసీ కెమెరా ఆధారంగా దొంగను కనిపెట్టి అతను రైలు కోసం వేచి ఉండగా టిఫిన్ చేసేందుకు రైల్వేస్టేషన్ బయటకు వచ్చిన సమయంలో పట్టుకున్నామని ఏఎస్సై మహబూబ్‌బాషా తెలిపారు. 2017లో చోరీకి పాల్పడే సమయంలో బంగారం దొంగతనం చేసి పట్టుబడటంతో ఆ రోజు నుంచి కేవలం నగదు మాత్రమే చోరీ చేస్తున్నాడు. రోజుకు రూ.10 వేల చోరీ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాడు. నిందితున్ని కనిగిరి కోర్టులో హాజరుపరచగా జడ్జి రిమాండ్ విధించారు. దొంగను చాకచక్యంగా పట్టుకోవటంలో నైపుణ్యం ప్రదర్శించిన ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు, సీఐ సీహెచ్ హజరత్తయ్య, ఎస్సై బి.మహేంద్ర, ఏఎస్సై షేక్ మహబూబ్‌బాషా, కానిస్టేబుల్ తిరుపతిస్వామి, రవి, సుమన్‌లను ఎస్పీ ఏఆర్ దామోదర్ ప్రత్యేకంగా అభినందించారు.

మాజీ ఆర్మీ ఉద్యోగిపై దాడి

- మహిళలను దూషించాడని స్తంభానికి కట్టేసి దాడి చేసిన గ్రామస్తులు
- మతిస్థిమితం లేదని చెప్తున్న సోదరుడు


స్థానికుల వద్ద స్టేట్‌మెంట్ రికార్డు చేసుకుంటున్న పోలీసులు


దాడికి గురైన మాగం సుబ్బారావు

దర్శి: మహిళలను తిట్టాడని మాజీ ఆర్మీ ఉద్యోగి మాగం సుబ్బారావు అనే వ్యక్తిని స్తంభానికి కట్టేసి దాడి చేసి గాయపరిచారు. ఈ సంఘటన మండలంలోని కొత్తపల్లి పంచాయతీ పరిధిలోని శ్రీరాంపురం కొష్టాలులో జరిగింది. వివరాల్లోకి వెళితే.. మాగం సుబ్బారావు బుధవారం రాత్రి పొలం, ఇళ్లు ఉందని కొష్టాలకు వెళ్లాడు. అయితే తెల్లవారుజామున గ్రామంలో వారు ఫోన్ చేసి మీ తమ్ముడు మహిళలు దూషిస్తున్నాడని సుబ్బారావు సోదరుడు హనుమంతరావుకు ఫోన్‌లో సమాచారం ఇచ్చారు. దీంతో హనుమంతరావు గ్రామానికి చేరుకునే లోపు గ్రామస్తులు స్తంభానికి కట్టి విచక్షణారహితంగా దాడి చేశారు. గ్రామానికి చెందిన వేనుగంటి సుబ్బయ్య, చేరెడ్డి శ్రీను, చేరెడ్డి వెంకట్రావు, కంభంపాటి నరసింహారావు, మరో నలుగురు కలిసి తన సోదరుడిపై దాడి చేశారని పోలీసులకు హనుమంతరావు ఫిర్యాదుచేశారు. అయితే సుబ్బారావుకు మతిస్థిమితం లేదని గ్రామస్తులు చెబుతున్నారు. బాధితున్ని మెరుగైన చికిత్స నిమిత్తం ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు.